క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలని కమిషనర్‌కు వినతి



కమిషనర్‌కు వినతిపత్రమిస్తున్న వార్డు ప్రజలు

చొప్పదండి: పట్టణంలోని ఆరోవార్డులో సీసీరోడ్లు, వీధి దీపాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, మురుగు కాలువలు శుభ్రం చేయక పోవడంతో దోమలు వృద్ధి చెంది రోగాలబారినపడుతున్నామని వార్డుప్రజలు బుధవారం మున్సిపల్ కమిషనర్ నాగరాజుకు వినతిపత్రం అందించారు. గతంలో చాలా వినతిపత్రాలు అందించినా పట్టించుకోలేదని, అభివృద్ధి పేరుతో శిలాఫలకాలు వేసి వదిలేయడంతో అవి కూడా శిథిలావస్థకు చేరుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి కల్లేపల్లి అరవింద్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పాలూరి ప్రసాద్, కల్లెపల్లి అజయ్‌బాబు, చిట్టిపాక విక్రమ్, పాలూరి లిఖిత్ కుమార్, తదితరులున్నారు.

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

చొప్పదండి: మండలంలోని సాంఘిక సంక్షేమ సైనిక శిక్షణ విద్యాలయానికి చెందిన విద్యార్థి కె.బలరాం జాతీయ స్థాయి టెన్నికోట్ పోటీలకు ఎంపికయ్యాడు. కరీంనగర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. జనవరి 29 నుంచి ఫిబ్రవరి 3 వరకు చెన్నైలో జరిగే నేషనల్ లెవల్ మీట్‌లో పాల్గొంటాడని తెలిపారు. మరో విద్యార్థి ఆర్. అక్షయ్ రాష్ట్ర స్థాయి రోలర్ స్కేటింగ్‌లో రోడ్ రేసింగ్ విభాగంలో రజతం, అలాగే స్కేటింగ్‌లో రింక్ కాంస్య పతకం సాధించాడని వివరించారు. ఈసందర్భంగా విద్యార్థులను సైనిక పాఠశాల డైరెక్టర్ కల్నల్ కేసీరావు, ప్రిన్సిపాల్ జి.కాళహస్తి, శ్రీనివాస్, ప్రమోద్‌రాజు, ఇనాక్, బాల సుందర్‌రావు, విక్రమ్ అభినందించారు.

రూ.5 లక్షల విరాళం



చెక్కు అందజేస్తున్న దాత రఘుపతిరెడ్డి

జమ్మికుంట: పట్టణంలోని ఆవాస విద్యాలయంలో సైన్స్ ల్యాబ్ భవనం నిర్మాణం, పరికరాల నిమిత్తం ఆవాస సమితి అధ్యక్షుడు, కంటి వైద్య నిపుణుడు శ్రీనివాస్‌రెడ్డి అభ్యర్థన మేరకు పట్టణానికి చెందిన డాక్టర్ వేముల రఘుపతిరెడ్డి కుమారుడు దీపక్‌రెడ్డి జ్ఞాపకార్థం రూ.5 లక్షల విరాళం ప్రకటించారు. ఆవాస ప్రధానాచారి సుధాకర్‌రావుకు బుధవారం చెక్కు అందించారు. ఈసందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి దాతలకు కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలిపారు.

పెస్టిసైడ్స్ డీలర్లకు శిక్షణ

చొప్పదండి: నిషేధిత పురుగు మందులపై వ్యవసాయ అధికారులు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. చొప్పదండి, జూలపల్లి మండలాలకు చెందిన పెస్టిసైడ్స్ డీలర్లకు పట్టణంలోని రైతు వేదికలో డివిజన్ వ్యవసాయ అధికారి ప్రియదర్శిని ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీయూఎం నిఖిత, ఏపీయూఎం మాధవి, రామారావు, వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో వైరల్!

హుజూరాబాద్: సినీనటుడు ఎన్టీఆర్‌ను చూడటమే చివరి కోరికని పట్టణానికి చెందిన క్యాన్సర్ పేషెంట్ స్వాతి(25) తల్లి రజిత బుధవారం సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి లేఖ రాశారు. ఈ లేటర్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

సేవలకు పురస్కారం



పురస్కారం అందుకుంటున్న అరుణ

మానకొండూర్‌రూరల్: మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన ఆరెల్లి అరుణప్రభంజన్ కొన్నేళ్లుగా అభయ స్వచ్ఛంద సంస్థ హైదరాబాద్ ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా కోఆర్డినేటర్‌గా విధులు నిర్వహిస్తోంది. సంస్థ వార్షికోత్సవాలు హైదరాబాద్‌లో నిర్వహించగా మహిళా సాధికారత, సమాజ సేవను గుర్తించి అభయ ఉత్తమ సోల్జర్, కోఆర్డినేటర్ పురస్కారం, బంగారు పతకం చిన్నజీయర్‌స్వామి, సంస్థ వ్యవస్థాపకుడు బాలచందర్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈసందర్భంగా పలువురు హర్షం వ్యక్తం చేశారు.

నేడు సివిల్ రైట్స్ డే

రామడుగు: మండలంలోని దత్తోజీపల్లి గ్రామంలో గురువారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించనున్నామని తహసీల్దార్ వెంకటలక్ష్మీ ప్రకటనలో తెలిపారు.



లారీ డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ కంచె వేణు

నిబంధనలు పాటించాలి

జమ్మికుంట: పట్టణంలో జాతీయ రోడ్డు భద్రతాపై మాసోత్సవాలపై బుధవారం హుజూరాబాద్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ కంచే వేణు డ్రైవర్లకు అవగాహన కల్పించారు. లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ రోడ్డు ప్రమాదాలను నివారించాలన్నారు. డ్రైవింగ్ చేస్తూ సెల్‌ఫోన్ మాట్లాడొద్దని, 18 సంవత్సరాలు నిండినవారు డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలని, లైసెన్స్ లేకండా వాహనం నడపటం చట్టరీత్యా నేరమని సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు మారెపల్లి రామస్వామి, ప్రధాన కార్యదర్శి ఎండీ రియాజుద్దీన్, కార్యదర్శి గుండారపు రాజేందర్, ఉపాధ్యక్షుడు గెంటియాల రాజేందర్, అమృత కోటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పవర్ ప్లాంట్ ఏర్పాటుకు స్థల పరిశీలన

చిగురుమామిడి: మండలంలోని ఉల్లంపల్లి, కొండాపూర్ గ్రామాల్లో మహిళా సంఘాలకు ప్రధాన మంత్రి కుసుమ్ యోజన కింద సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు డీఆర్‌డీవో ప్రాజెక్టు డైరెక్టర్ పి. శ్రీధర్ బుధవారం స్థల పరిశీలన చేశారు. డీపీఎం చింతల ప్రవీణ్ తో కలిసి రెండు గ్రామాల్లో పర్యటించారు. స్వశక్తి సంఘాల మహిళలకు ఒక మెగావాట్ పవర్ ప్లాంట్ ఏర్పాటు కోసం రూ.మూడు కోట్ల విలువ గల ప్రాజెక్టును టీఎస్‌రెడ్‌కో ఇందన సంస్థ మంజూరు చేసింది. రెండు గ్రామాల్లో నాలుగు ఎకరాల ప్రభుత్వ స్థలం ఉందా లేదా అని రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. రూ.మూడు కోట్ల రుణంలో పదిశాతం స్వశక్తి సంఘాల మహిళలు కంట్రిబ్యూషన్‌గా చెల్లించాల్సి ఉంటుందని, మిగిలిన 90 శాతం నిధులు బ్యాంకుల ద్వారా రుణం తీసుకుని ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకుని లబ్ధిపొందాల్సి ఉంటుందని చిగురుమామిడి ఏపీఎం మట్టెల సంపత్ తెలిపారు. స్థల సేకరణ పూర్తికాగానే ప్రాజెక్టు మంజూరు అవుతుందన్నారు. పీడీ వెంట ఆర్‌ఐ అరుణ్‌కుమార్, సర్వేయర్ బాలమురళీకృష్ణ, ఐకేపీ సీసీ వెంకటమల్లు తదితరులున్నారు.



ఉల్లంపల్లిలో స్థల పరిశీలన చేస్తున్న పీడీ శ్రీధర్

పీవీ సేవా సమితి సేవలు అభినందనీయం

హుజూరాబాద్: పీవీ సేవా సమితి పేరుతో హుజూరాబాద్ బాధ్యులు చేస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్సీ వాణీదేవి అన్నారు. బుధవారం సమితి బాధ్యులు హైదరాబాద్‌లో ఎమ్మెల్సీని మర్యాద పూర్వకంగా కలిశారు. సేవా సమితి సేవలను వివరించారు. పీవీ విగ్రహం ఏర్పాటు చేయనున్నామని తెలపగా సహాయ సహకారం అందిస్తానన్నారని సభ్యులు తెలిపారు. పీవీ సేవా సమితి అధ్యక్షుడు తూము వెంకట్ రెడ్డి, అలయన్స్ క్లబ్ అధ్యక్షుడు మనోజ్ ఉన్నారు.



సమస్యను పరిష్కరించాలి

హుజూరాబాద్: జర్నలిస్టుల ఇళ్ల సమస్యను పరిష్కరించాలని కోరుతూ వివిధ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం హుజూరాబాద్ జర్నలిస్టులు చేపట్టిన నిరసన కార్యక్రమానికి మద్దతు తెలిపారు. ప్రెస్‌క్లబ్ నుంచి పట్టణంలోని ప్రధాన వీధుల గుండా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ అంబేడ్కర్ చౌరస్తా వరకు బైక్ ర్యాలీ చేపట్టారు. అనంతరం కళాకారులు ఆటపాట నిర్వహించారు. ఇళ్ల స్థలాలను కాంగ్రెస్ పార్టీ అడ్డుకోవడం సిగ్గుచేటని, ఇప్పటికైనా నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్, మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించాలన్నారు. ప్రభుత్వం కాలయాపన చేస్తే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం కేసీ క్యాంపు వరకు ర్యాలీ వెళ్లి ఆర్డీవో ఏవో శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. నిరసనలో ప్రెస్‌క్లబ్ కన్వీనర్ ధర్మారెడ్డి, కోకన్వీనర్లు రాములు, సాయికృష్ణ, మున్సిపల్ మాజీ చైర్మన్ రాధిక, బీఆర్ఎస్ నాయకుడు శ్రీనివాస్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు రాజు, ప్రజాసంఘాల నాయకులురత్నం, జనార్దన్, పాడిశ్రీశెట్టి వెంకటరాజం, మార్త రవీందర్, విష్ణుదాస్ గోపాలరావు, బత్తుల మనోజ్ ప్రెస్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

దిష్టిబొమ్మ దహనం

రామడుగు: మండల కేంద్రంలో బుధవారం రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను బీజేవైఎం మండల నాయకుడు దుర్శెట్టి రమేశ్ ఆధ్వర్యంలో దహనం చేశారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ పద్మశ్రీ అవార్డుల విషయంలో మాట్లాడిన మాటలు వాస్తవమేనని అన్నారు.

గన్నేరువరం: బండి సంజయ్‌కుమార్‌పై సీఎం రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలను బీజేపీ మండల అధ్యక్షుడు నికేష్ ఖండించారు. మండలకేంద్రం సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు.

మానకొండూర్: మండలంలోని బీజేపీ నాయకులు కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టి సీఎం దిష్టిబొమ్మ దహనం చేశారు.

హుజూరాబాద్: అంబేడ్కర్ చౌరస్తా వద్ద బీజేపీ పట్టణ, మండలశాఖ ఆధ్వర్యంలో నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు.

పథకాల అమలులో ప్రభుత్వం విఫలం

వీణవంక: సంక్షేమ పథకాల అమలులో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సుధాకర్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం మాట్లాడారు. పథకాల పేరుతో ప్రభుత్వం కాలయాపన చేస్తుందని విమర్శించారు.

టీబీ నిర్మూలనకు సహకరించాలి

చిగురుమామిడి: టీబీ వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీడీవో మధుసూదన్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులతో అవగాహన, శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. టీబీ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ధ్యేయమని, ఇంపాక్ట్ ఇండియా ప్రాజెక్టు ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని గ్రామాల్లో జిల్లా క్షయవ్యాధి నిర్మూలన విభాగం వైద్య పరీక్షలు నిర్వహిస్తుందని, పంచాయతీ కార్యదర్శులు సహకరించాలని సూచించారు. కా కార్యక్రమంలో మండలపరిషత్ సూపరింటెండెంట్ ఖాజామొయినొద్దీన్, ఎస్‌టీఎస్ సదయ్య పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



టీబీపై అవగాహన కల్పిస్తున్న మధుసూదన్

రోడ్డు ప్రమాదంలో గాయాలు

మానకొండూర్: అసిస్టెంట్ లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న బుర్ర కిషన్(43)విధి నిర్వహణలో భాగంగా బుధవారం అన్నారం గ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా మండలంలోని జగ్గయ్యపల్లి గ్రామంలో ఎదురుగా వస్తున్న 108 వాహనం ఢీకొట్టింది. తీవ్ర గాయాలు కాగా క్షతగాత్రుడిని స్థానికులు కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

శంకరపట్నం: మండలంలోని ఎరడపల్లి గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు గాయాలపాలైనట్లు స్థానికులు తెలిపారు. వీణవంక మండలం గంగారం గ్రామానికి చెందిన నరహరి ఇంద్రసేనారెడ్డి (55) బుధవారం ఎరడపల్లి గ్రామానికి ద్విచక్రవాహనంపై స్వగ్రామం వెళ్తుండగా కుక్క అడ్డురావడంతో అదుపుతప్పి రోడ్డుపై పడిపోయాడు. స్థానికులు కరీంనగర్ తరలించారు.

ఐదుగురిపై కేసు

జమ్మికుంట: అదనపు కట్నం వేధింపులకు పాల్పడిన ఐదుగురిపై కేసు నమోదు చేశామని టౌన్ సీఐ వరంగంటి రవి బుధవారం తెలిపారు. పట్టణానికి చెందిన సంధ్యకు మాచనపల్లి గ్రామానికి చెందిన మాడుగుల చక్రవర్తితో 2014లో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు, పెళ్లి సమయంలో కట్నకానుకలు ముట్టజెప్పారు. కొన్ని రోజులుగా అదనపు కట్నం తీసుకురావాలని భర్త, అత్తమామలు, భర్త అన్న శోభన్‌బాబు, ఆడపడుచు రేణిగుంట్ల స్వరూప వేధింపులకు పాల్పడుతున్నారని బాధితురాలు ఫిర్యాదుతో కేసు నమోదు చేశామన్నారు.

డ్రగ్స్ వినియోగం అరికట్టాలి

గన్నేరువరం: మండలంలో డ్రగ్స్ వినియోగం అరికట్టాలని జంగపల్లి గ్రామానికి చెందిన గుంటుక లక్ష్మీపతి, అనుమండ్ల సతీష్‌కుమార్ బుధవారం ఎస్సై తాండ్ర నరేశ్‌కు వినతిపత్రం అందజేశారు. మత్తుపదార్థాలతో భవిష్యత్ అంధకారం, కుటుంబాలు మనోవేదనకు గురవుతున్నాయని, ఇటీవల మండలంలో జరిగిన సంఘటనలే ఇందుకు నిదర్శనమన్నారు. డ్రగ్స్ వినియోగం, విక్రయాలపై పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై వారికి సూచించారు.



వినతిపత్రం ఇస్తున్న లక్ష్మీపతి, సతీశ్

అన్నిగ్రామాల్లో పథకాలు అమలు చేయాలి



కరీంనగర్- వరంగల్ జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న బీజేపీ నాయకులు

శంకరపట్నం: అన్ని గ్రామాల్లో సంక్షేమ పథకాలు అమలు చేయాలని బీజేపీ నాయకులు బుధవారం కేశవపట్నంలో రాస్తారోకో చేశారు. రైతుభరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు ఇప్పలపల్లి గ్రామస్తులకే అందించడం సరికాదన్నారు. అర్హులందరికీ పథకాలు వర్తింపజేయాలని కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం పోలీసులు రాస్తారోకో విరమింపజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు అనిల్, వెంకట్ రెడ్డి, కొంరయ్య, శ్రీనివాస్, నరేందర్, కుమార్‌యాదవ్, సంపత్, రాజు, జైపాల్ తదితరులున్నారు.

కేశవపట్నం పీహెచ్‌సీ తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న డీఐవో సాజిదా

శంకరపట్నం: కేశవపట్నం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని బుధవారం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి సాజిదా తనిఖీ చేశారు. పీహెచ్‌సీ రికార్డులను పరిశీలించారు. చిన్నారుల వ్యాక్సినేషన్ వివరాలు వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య ఉపకేంద్రాల నిర్వహణ, గ్రామాల్లో ఏఎన్ఎం, ఆశ కార్యకర్తల సేవలపై ఆరా తీశారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించొవద్దని సిబ్బందికి సూచించారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ

సైదాపూర్: మండలంలోని ఆకునూర్ జీపీ నిధుల దుర్వినియోగంపై బుధవారం హుజూరాబాద్ డివిజినల్ పంచాయతీ అధికారి శ్రీనివాస్ విచారణ చేపట్టారు. మాజీ సర్పంచ్ నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డాడని ఆరోపిస్తూ గ్రామానికి చెందిన ఓ బీజేపీ నాయకుడు కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు హుజూరాబాద్ డివిజనల్ పంచాయతీ అధికారి శ్రీనివాస్ విచారణ చేసి నివేదికను జిల్లా అధికారులకు తెలియజేస్తానన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో యాదగిరి, ఏంపీవో ఖాజాబషీరుద్దీన్ ఉన్నారు.



తిమ్మాపూర్: కరీంనగర్ కార్పొరేషన్ 8వ డివిజన్ పరిధి అల్గునూర్ శివారు తమిళ కాలనీలో డ్రెయినేజీ నిర్వహణ సరిగా లేకపోవడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. లోయర్ మానేరు డ్యాం నుంచి వచ్చే లీకేజీ నీరు సమీపంలోని కాలువను మట్టితో పూడ్చడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఈగలు, దోమలు వృద్ధిచెంది స్థానికులు రోగాలబారిన పడుతున్నారు. ఇళ్లనుంచి వచ్చే డ్రైనేజీ నీరు కూడా ఎటూ వెళ్లకపోవడంతో దుర్గంధం భరించలేకపోతున్నామని కాలనీలోని 60 కుటుంబాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
వేణుమాధవ్, అసిస్టెంట్ కమిషనర్, కరీంనగర్ సెల్‌నం: 9849907538

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

నేడు వెదిరలో ఉచిత కంటి వైద్య శిబిరం

రామడుగు: మండలంలోని వెదిర గ్రామ చావడి వద్ద గురువారం ఉదయం 10 గంటలకు లయన్స్ క్లబ్‌తో పాటు రేకుర్తి కంటి వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తామని అవకాశాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు. వివిధ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేస్తామని లయన్స్ క్లబ్ ప్రతినిధులు వివరించారు.

నేటి నుంచి వెంకన్న బ్రహ్మోత్సవాలు

వీణవంక: మండలంలోని మామిడాలపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు జరగనున్నాయని ఆలయ చైర్మన్ సత్యనారాయణ తెలిపారు. ఫిబ్రవరి 1న స్వామివారి కల్యాణ మహోత్సవం, అదేరోజు సాయంత్రం శకటోత్సవం(బండ్లు తిరుగుట), 2న సాయంత్రం రథోత్సవం, 3న మహా పూర్ణాహుతి, నాగవెల్లి ఉంటుందని, భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

రైతుభరోసాకు దరఖాస్తు చేసుకోవాలి

జమ్మికుంట: కొత్తగా పట్టాదారు పాస్‌బుక్కులు పొందినవారు రైతుభరోసాకు రైతు వేదికల్లో దరఖాస్తు చేసుకోవాలని ఏవో ఖాదర్ హుస్సేన్ బుధవారం ప్రకటనలో తెలిపారు. యాసంగికి రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడి సాయం అందజేస్తుందని, ఈ నెల 31వ తేదీ వరకు దరఖాస్తుచేసుకోవాలన్నారు.

డీటీఎఫ్ కార్యవర్గం



వేణుమాధవ్

జమ్మికుంట: పట్టణంలోని బాలుర ప్రభుత్వ పాఠశాలలో బుధవారం డీటీఎఫ్ జమ్మికుంట మండల కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. డీటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఏబూషి శ్రీనివాస్, పరిశీలకుడు రాష్ట్ర కౌన్సిలర్ సదానందం, జిల్లా అధ్యక్షుడు అవాల నరహరి ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా వేణుమాధవ్, ప్రధాన కార్యదర్శిగా రాజేందర్, ఉపాధ్యక్షులుగా చంద్రశేఖర్, సపంత్, రాగిణి, వెంకట్‌రెడ్డి, కార్యదర్శులు హరీశ్‌కుమార్, వేణుగోపాల్, దేవేందర్, తిరుపతి, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా సంపత్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నియామకం



రమేశ్‌ను సన్మానిస్తున్న నాయకులు

జమ్మికుంట: జమ్మికుంట గుమాస్తాల సంఘం అధ్యక్షుడిగా వీర్ల రమేశ్ నియామకమయ్యారు. పట్టణంలో బుధవారం గౌరవ అధ్యక్షుడు పొనగంటి మల్లయ్య ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. ఉపాధ్యక్షుడిగా పొనగంటి సురేశ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా నవీన్‌కుమార్, కార్యదర్శిగా గజ్జి గోపి, కోశాధికారిగా ఎండీ సజ్జత్ పాషా, ముఖ్య సలహాదారుడిగా పోశాల వెంకన్న, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈకార్యక్రమంలో అడ్తిదారుల సంఘం అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు, గుమాస్తాలు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ కమిటీ

శంకరపట్నం: ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ శంకరపట్నం మండల కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిరి రవి తెలిపారు. వంకాయగూడెంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఎన్నికలు నిర్వహించగా అధ్యక్షుడిగా చౌడమల్ల సంపత్, ప్రధాన కార్యదర్శిగా బొంగోని కుమార్, కోశాధికారిగా రమేశ్, ఉపాధ్యక్షులుగా గోరే మియా, మనోహరాచారీ ఎన్నికయ్యారని వివరించారు.



నూతన కమిటీ సభ్యులు

పాఠశాలకు సామగ్రి అందజేత

హుజూరాబాద్: మండలంలోని సిర్సపల్లి ప్రభుత్వ పాఠశాలకు ఆదామా పెస్టిసైడ్స్ కంపెనీ సహకారంతో ఎన్జీవో సంస్థ ఆధ్వర్యంలో రూ.నాలుగు లక్షల విలువ గల సామగ్రి అందజేశారు. హెచ్ఎం వీడెపు శ్రీనివాస్ మాట్లాడుతూ.. సామగ్రితో విద్యార్థులకు మెరుగైన సదుపాయాలు అందుతాయని అన్నారు. కంపెనీ సేల్స్ మేనేజర్ పాపానాయుడిని హెచ్ఎం, నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ గంగా, వైస్ చైర్మన్ రజనీ, ఏఈవో సతీష్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కొండాల్‌రెడ్డి, కంపెనీ ప్రతినిధులు ప్రకాశ్, తూముల చక్రధర్, మనోహర్, మాజీ సర్పంచ్ విజయకుమార్, తక్కళ్లపల్లి వెంకట్రావ్, రైతులు వంగాల వెంకట్ రెడ్డి, సదాశివరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పేద విద్యార్థులకు అండగా లయన్స్ క్లబ్

చొప్పదండి: పేద విద్యార్థులకు లయన్స్ క్లబ్ అండగా ఉంటుందని క్లబ్ జిల్లా ఉపగవర్నర్ మోర భద్రేశం అన్నారు. పట్టణానికి చెందిన ముగ్గురు పేద విద్యార్థులకు చొప్పదండి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఎడ్యుకేషనల్ సర్వీస్ ట్రస్టు ద్వారా ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేశారు. భవిష్యత్‌లో మరిన్ని సేవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు మల్లేశం, లక్ష్మీకాంతం, కొల్లూరి జితేందర్, వల్లాల జగన్, మామిడి రాజేశ్ పవార్, తొడుపునూరి సత్యనారాయణ, కొల్లూరి ఆనందం, వల్లాల కృష్ణహరి, చింతల రవి, మాడూరి శ్రీనివాస్, సిరిపురం రాజు, లక్ష్మయ్య, సుధాకర్, ఆంజనేయులు, అంజయ్య, సాంబమూర్తి, వెంకటేశ్, శివకుమార్, రాజేశం, కనుకయ్య తదితరులు పాల్గొన్నారు.



సైకిళ్లు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

నాయకుల సంబరాలు

హుజూరాబాద్: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద మాజీ సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాసు చిత్రపటాలకు బీఆర్ఎస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. దళితబంధు రెండో విడత నిధులపై ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి పోరాటాల ఫలితంగానే ప్రభుత్వం దిగివచ్చిందని. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరిత రాజకీయాలు మానుకోవాలన్నారు.

జమ్మికుంట: పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద దళిత నాయకుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో...

హుజూరాబాద్: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రణవ్ చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు పాలాభిషేకం చేశారు. నిధుల విడుదలకు ప్రభుత్వం అంగీకరించడాన్ని హర్షిస్తూ క్షీరాభిషేకం చేశారు.

జమ్మికుంట: కాంగ్రెస్ ప్రభుత్వం దళిత పక్షపాతి అని యూత్‌కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపల్లి నాగరాజు అన్నారు. బుధవారం పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

దిష్టిబొమ్మ దహనం సరికాదు

ఇల్లందకుంట: బీజేపీ మండల అధ్యక్షుడు బైరెడ్డి రమణారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బడిసంజయ్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. యూత్ కాంగ్రెస్ నాయకులు బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేయడాన్ని ఖండించారు. ఎంపీ నిధులు అన్ని గ్రామాలకు తీసుకువచ్చి రాష్ట్ర అభివృద్ధిలో భాగమవుతున్నారని అన్నారు.

చొప్పదండి: గద్దర్‌కు పద్మ అవార్డు విషయంలో బండి సంజయ్ మాటలు వాస్తవమేనని, జీర్ణించుకోని కాంగ్రెస్ నాయకులు కేంద్ర మంత్రి దిష్టి బొమ్మ దహనం చేయడం తగదని బీజేపీ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ అన్నారు. బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

క్షీరాభిషేకం

మానకొండూర్: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు, మందకృష్ణమాదిగకు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు ప్రకటించినందున బుధవారం మాదిగలు మానకొండూర్ పల్లె చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పాలాభి షేకం చేసారు.

చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లి గ్రామంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిర్వహించిన కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.